సాక్షి
మెదక్
బుధవారం । 19 । ఫిబ్రవరి । 2025



పెరిగిన బియ్యం కోటా

కొత్త రేషన్‌కార్డుల మంజూరు జిల్లాలో పంపిణీ చేసే బియ్యం కోటా ఈనెల నుంచి పెరిగింది. వివరాలు 8లో ▸



పోలింగ్ కేంద్రాల వద్ద..

పోలింగ్ కేంద్రం వద్ద నిబంధనల మేరకు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి సూచించారు. వివరాలు 8లో ▸



భక్తిశ్రద్ధలతో మల్లన్న జాతర

మండలంలోని చెన్నపూర్‌లో భక్తిశ్రద్ధలతో మల్లన్న జాతర జరిగింది.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

రేపటి నుంచి పారిశుద్ధ్య కార్మికుల సమ్మె

సీఐటీయూ ఉపాధ్యక్షురాలు బాలమణి ప్రకటన



కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

రామాయంపేట(మెదక్): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి మాట్లాడుతూ.. ఈనెల 20 నుంచి సమ్మె చేస్తామని, పారిశుద్ధ్య పనులు బంద్ చేస్తామని ప్రకటించారు. కార్మికుల సమస్యల పరిష్కారం విషయమై ఎవరూ పట్టించుకోవడంలేదని విమర్శించారు. జూలై నుంచి పీఎఫ్, ఈఎస్ఐ వారి ఖాతాల్లో జమ కావడం లేదని, వెట్టిచాకిరీ చేస్తున్న కార్మికులకు ఇస్తున్న నెలవారీ వేతనాలు సైతం సక్రమంగా రావడం లేదన్నారు. వారికి ఇవ్వాల్సిన సబ్బులు, మాస్కులు, గ్లౌవుజులు సైతం ఇవ్వడంలేదని వాపోయారు.

రేపటి నుంచి ఎలక్ట్రిక్ బగ్గీల పోటీలు



మాట్లాడుతున్న సంజయ్ దూబె

నర్సాపూర్ : బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో 20 నుంచి 25 వరకు ఎలక్ట్రిక్ బగ్గీల పోటీలు ప్రారంభ మవుతాయని ప్రిన్సిపాల్ సంజయ్ దూబె తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ స్థాయి ఈ బాహ –సే ఇండియా 2025ను తమ కాలేజీలో వరుసగా రెండోసారి నిర్వహించడం ఆనందించదగ్గ విషయమన్నారు. పోటీల ద్వారా విద్యార్థులు తమలోని నైపుణ్యాన్ని పెంచుకోవడంతో పాటు నిబద్ధత ప్రదర్శించే అవకాశం లభిస్తుందన్నారు. పోటీల్లో పలు రాష్ట్రాలకు చెందిన 85 ఇంజనీరింగ్ కాలేజీలకు చెందిన విద్యార్థుల జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఈ పోటీలు వివిధ దశల్లో ఉంటాయని తెలిపారు. ఆయన వెంట కాలేజీ ప్రొఫెసర్లు రాయుడు, దశరథ రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను ఎమ్మెల్సీగా గెలిపించండి

సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి



ప్రచారం చేస్తున్న గోదావరి, మల్లేశంగౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకనే ఎమ్మెల్సీగా గెలిపించాలని సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి కోరారు. మంగళవారం నార్సింగి మండల కేంద్రంలో మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు మల్లేశం గౌడ్‌తో కలిసి తన భర్త ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి తరఫున ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు, జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక గ్రాడ్యుయేట్స్‌ను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక రంగంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడంతోపాటు ప్రజల కోసం పని చేసే వారిని గెలిపించాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే గుంపులో ఒకడిగా ఉంటాడు తప్పితే ప్రజల సమస్య పట్టవన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, గోవింద్, గణేశ్, పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, బీజేపీ నాయకులు లింగారెడ్డి, నర్సింహులు, గురుపాదం, హరిబాబు, నరేశ్, సంతోష్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

డీఈఓ రాధాకిషన్

పాపన్నపేట(మెదక్): పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని కుర్తివాడ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులు ప్రాక్టీస్ టెస్ట్ ఎలా రాస్తున్నారో పరిశీలించారు. వచ్చే నెలలో పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, మిగిలిన కొన్ని రోజులు ముఖ్యమైనవని చెప్పారు. సమయాన్ని వృథా చేయకుండా చదవాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రణాళిక ప్రకారం విద్యార్థులను సమాయత్తం చేయాలని కోరారు. ఆరవ తరగతి విద్యార్థులతో పాఠాలు చదివించారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఏఎంఓ సుదర్శన మూర్తి, హెచ్‌ఎం శ్రీనివాస్ రావు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు

కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయండి: కలెక్టర్

మెదక్ కలెక్టరేట్: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరా, రైతు భరోసా తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వ్యవసాయ రంగం, తాగునీరు, విద్యుత్ అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్హులందరికీ రైతుభరోసా అందేలా చూడాలన్నారు. అంతకుముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. సాగునీరు, తాగునీరు, విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నగేష్, డీపీఓ యాదయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్కిల్ వర్సిటీ పనులు వేగవంతం చేయాలి

పాపన్నపేట(మెదక్): మెదక్ జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడానికి స్థలం గుర్తింపు పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని తమ్మాయపల్లి, పాపన్నపేట గ్రామశివారులో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. యూనివర్సిటీ ఏర్పాటుకు 10 నుంచి 15 ఎకరాల భూమి అవసరమవుతుందని చెప్పారు. అనువైన భూమికి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసి, హైదరాబాద్‌లోని భూ పరిపాలనా విభాగం కార్యాలయానికి పంపాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీఓ రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ మహేందర్ గౌడ్ ఉన్నారు.

పదోన్నతి బాధ్యతను పెంచుతుంది

మెదక్ కలెక్టరేట్: పదోన్నతి బాధ్యతను పెంచుతుందని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న 11 మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా కామారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు కేటాయించారు. పదోన్నతి పొందిన ఉద్యోగులు మంగళవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని కలెక్టర్ అభినందించారు. వృత్తినే దైవంగా భావించి ప్రజలకు సేవలు అందించాలని సూచించారు.



పదోన్నతి పొందిన ఉద్యోగులను అభినందిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

అంగన్‌వాడీలకు మహర్దశ

వసతుల కల్పనకు రూ. 90.52 లక్షలు మంజూరు

- ముమ్మరంగా సాగుతున్న పనులు

జిల్లాలో అంగన్ వాడీ కేంద్రాలకు మహర్దశ కలగనుంది. ఆయా కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.



బ్యాతోల్ అంగన్‌వాడీ కేంద్రంపై నీటి ట్యాంకును ఏర్పాటు చేసిన దృశ్యం

మెదక్‌జోన్: ఆట పాటలతో చిన్నారులకు ప్రాథమిక విద్యను అందించే అంగన్ వాడీ కేంద్రాలకు మంచి రోజులొచ్చాయి. ఆయా కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్రం రూ. 90.52 లక్షల నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం, చిన్న చిన్న మరమ్మతులు చేపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా 1,075 అంగన్ వాడీ కేంద్రాలు ఉండగా, వాటిలో 369 సెంటర్లకు సొంత భవనాలు ఉన్నాయి. అద్దె భవనాల్లో 302, పాఠశాలలు, కమ్యూనిటీ హాల్స్‌లో 404 కేంద్రాలు కొనసాగుతున్నాయి. వాటిలో 52,780 మంది చిన్నారులు ప్రాథమిక విద్యనభ్యసిస్తున్నారు. కాగా అనేక కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేకపోవటంతో చిన్నారులు అవస్థలు పడుతున్నారు. దీంతో తాగునీటి వసతి, మరుగుదొడ్లు, మరమ్మతుల కోసం 'సాక్ష్యం 'పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కాగా జిల్లాలో 282 కేంద్రాల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. 227 కేంద్రాల్లో మరుగుదొడ్లు లేకపోవటంతో చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. ఒంటికి, రెంటికి వస్తే ఇళ్లకు వెళ్లి తిరిగి పాఠశాలకు రావడం లేదు. ఈ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఒక్కో నిర్మాణానికి రూ. 36 వేల చొప్పున రూ. 81,72,000 నిధులు కేటాయించారు. అలాగే 40 కేంద్రాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో, ఒక్కో కేంద్రానికి రూ. 17 వేల చొప్పున రూ. 6,80,000 మంజూరయ్యాయి. వీటితో సంపు నిర్మాణం, భవనంపై ట్యాంకు, నల్లాలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే 15 అంగన్ వాడీ కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్నింటిలో తలుపులు, కిటికీలు దెబ్బతినగా.. మరికొన్ని వర్షాకాలంలో ఉరుస్తున్నాయి. వీటిలో మరమ్మతుల కోసం మరో రూ. 2 లక్షలు మంజూరయ్యాయి. ఈ లెక్కన మొత్తం రూ. 90.52 లక్షల నిధులు మంజూరు కావటంతో పంచాయతీరాజ్‌శాఖ అధికారుల పర్యవేక్షణలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

జిల్లాలో ఇలా..

అంగన్ వాడీ కేంద్రాలు	1,075
నూతనంగా నిర్మించే మరుగుదొడ్లు	227
తాగునీటి సౌకర్యం కల్పించే కేంద్రాలు	40
కేటాయించిన నిధులు (లక్షల్లో)	రూ. 90.52

పనులు చకచకా సాగుతున్నాయి



అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్స్, తాగునీటి వసతిలేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యల పరిష్కారం కోసం నిధులు మంజూరు కావడంతో పనులు చక చక కొనసాగుతున్నాయి. దీంతో శాశ్వతంగా సమస్యలు తీరనున్నాయి.

– హైమావతి, డీడబ్ల్యూఓ

అంగన్‌వాడీలు బాధ్యతాయుతంగా ఉండాలి

జిల్లా సంక్షేమ శాఖ అధికారి హైమావతి



మాట్లాడుతున్న హైమావతి

అల్లాదుర్గం(మెదక్): అంగన్‌వాడీ టీచర్లు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా ఉండాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి హైమావతి అన్నారు. మండలంలోని ముస్లాపూర్‌లో మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీచర్లు సమయపాలన పాటించాలని, పిల్లలకు ప్రీస్కూల్ కార్యక్రమాలు ప్రణాళిక ప్రకారం నిర్వహించాలని చెప్పారు. ఆన్‌లైన్ రిపోర్టులు ఎప్పటికప్పుడు పూర్తి చేసి గ్రామాలలో బాల్యవివాహాలు జరగకుండా ఉండేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. మేనరికం వివాహాల వల్ల అంగవైకల్యం ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ పద్మలత, డీహెచ్‌ఈడబ్లూ సంతోషి, ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు, పోషణ్ అభియాన్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పదిలో ఉత్తీర్ణత శాతం పెంచాలి

జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

కొల్చారం(నర్సాపూర్): పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అన్నారు. మంగళవారం మండలంలోని రంగంపేట ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ప్రధానోపాధ్యాయుడు ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలు అంటే భయం లేకుండా పూర్తి సన్నద్ధం చేయాలని సూచించారు. పాఠశాలలోని సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇక్కడి పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న సిబ్బందిని అభినందించారు. ప్రత్యేక వంటశాల లేకపోవడంపై మధ్యాహ్న భోజన సిబ్బంది సీఈఓ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీడీ శ్రీధర్ రెడ్డి ఉన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాగమణి, కళావతి తదితరులు

మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి నాగమణి

- బేటీ బచావో.. బేటీ పడావోపై అవగాహన

నర్సాపూర్ రూరల్: బాల్య వివాహాలు అరికట్టే బాధ్యత అందరిపై ఉందని మిషన్ శక్తి జిల్లా మహిళా సాధికారిత విభాగం సభ్యురాలు నాగమణి అన్నారు. మంగళవారం నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారిత విభాగం, ఎన్ఎస్ఎస్ సేవా పథకం ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భ్రూణహత్యలు, లింగవివక్షత, స్త్రీల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, బాల్యవిహాలు మహిళల పురోగతికి అవరోధంగా మారాయన్నారు. రాజ్యాంగపరంగా మహిళలకు ఎన్నో హక్కులు కల్పించినప్పటికీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలను రక్షించి చదివించాల్సిన బాధ్యత ప్రతి తల్లిదండ్రులపై ఉందన్నారు. మహిళలకు సఖీ కేంద్రం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వేధింపులకు గురవుతున్న బాలికలు, మహిళలు మానసికంగా కృంగి పోకుండా ధైర్యంగా పోలీసులు, భరోసా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు ఉద్బోధించారు. అనంతరం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సఖీ కేంద్రం అధికారిణి కళావతి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ అడెప్ప, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సురేష్ కుమార్, అధ్యాపకులు సమీరా, రుక్మిణి, శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

అపార్‌ఐడీ త్వరగా పూర్తిచేయండి

గిరిజన సంక్షేమశాఖ జిల్లా సెక్టోరియల్ అధికారి జ్యోతి



మాట్లాడుతున్న జిల్లా సెక్టోరియల్ అధికారి జ్యోతి

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థుల అపార్ ఐడీ త్వరగా పూర్తి చేయాలని గిరిజన సంక్షేమశాఖ సెక్టోరియల్ అధికారి జ్యోతి అన్నారు. మంగళవారం కౌడిపల్లిలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదిలో విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని తెలిపారు. విద్యార్థుల అపార్‌ఐడీ కార్డులు వందశాతం పూర్తిచేయాలన్నారు. సమస్యలుంటే ఎంఈఓ, జిల్లా అధికారులకు తెలియజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ జయరాజ్, ఉపాధ్యాయులు దుర్గయ్య, నరేందర్, మంజుల, రాజేశ్వరీ, సత్యాగౌడ్, వినోద, గేమ్‌సింగ్, పీఈటీ పానీల్‌కుమార్, ఏఎన్ఎం వెన్నెల, సీఆర్‌పీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ లింకేజీ లక్ష్యాన్ని సాధించండి

డీఆర్డీఓ శ్రీనివాసరావు

వెల్దుర్తి(తూప్రాన్): బ్యాంక్ లింకేజీ కింద అర్హులైన స్వయం సహాయక సంఘాలకు ఈ ఆర్థిక సంవత్సరం ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని డీఆర్డీఓ శ్రీనివాసరావు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం వెల్దుర్తి మండల సమైఖ్య కార్యాలయంలో నిర్వహించిన వీఓఏల రివ్యూ మీటింగ్‌కు ఆయన హాజరై పలు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు లింకేజీ టార్గెట్ 130 శాతం చేయాలని, బ్యాంకు లింకేజీ ఎన్‌పీఏని 0.5 శాతానికి తగ్గించాలని సూచించారు. స్త్రీ నిధి టార్గెట్ అచీవ్‌మెంట్ 130 శాతం చేయాలని, స్త్రీ నిధి ఎన్‌పీఏని 0.5 శాతానికి తగ్గించాలన్నారు. ఈ ప్రోగ్రాంలో భాగంగా ప్రతీ మహిళా ఒక్కో మొక్క నాటాలని వివరించారు. కార్యక్రమంలో స్త్రీనిధి ఆర్ఎం గంగారాం, ఏపీఎం శంకరయ్య, సీసీలు సత్యం, యాదగిరి, కిషన్, రజిత, స్త్రీనిధి ఏఎం కరుణాకర్, వీఓఏలు పాల్గొన్నారు.

బీజేపీవి మత రాజకీయాలు

డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్



మాట్లాడుతున్న ఆంజనేయులుగౌడ్

మెదక్‌జోన్: బీజేపీవి మత రాజకీయాలని, కాంగ్రెస్‌తోనే ప్రజాస్వామ్య విలువలు కొనసాగుతాయని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 22న జిల్లా కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపు కోసం సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ హాజరు కానున్నట్లు తెలిపారు. బీజేపీ పాలనలో అన్ని వర్గాల వారికి నష్టం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఇసుక, మట్టి మాఫియా అరాచకాలు అంతా ఇంత కాదన్నారు. దేశంలో ఏ పార్టీ చేయని కుల గణన, ఆరు గ్యారంటీలు అమలు చేసి కాంగ్రెస్ ఆదర్శంగా నిలిచిందన్నారు. బీజేపీకి మేలు చేసేందుకే బీఆర్ఎస్ పోటీలో అభ్యర్థిని నిలపలేదని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు సుప్రభాత్‌రావు, సురేందర్ గౌడ్, రమణ, శ్రీనివాస్‌చౌదరి, అంజాగౌడ్, శ్రీనివాస్, పవన్, శేఖర్, రాజలింగం, మల్లేశం గౌడ్, మధుసుదన్‌రావు పాల్గొన్నారు.

చిన్నమ్మకు నివాళి

అంత్యక్రియల్లో పాల్గొన్న జస్టిస్ సుభాష్‌రెడ్డి



చిన్నమ్మ బాలమణి మృతదేహానికి పూలమాల వేస్తున్న జస్టిస్ సుభాష్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కామారం గ్రామానికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి మాతృమూర్తి బాలమణి అంత్యక్రియల్లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఆర్.సుభాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన చిన్నమ్మ బాలమణి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అంజిరెడ్డి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీమన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు, తోటి పీఏసీఎస్ చైర్మన్‌లు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌తో.. కొలువు పక్కా!

- తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్య
- 'సాక్షి'తో మహిళా పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ భవాని



మెదక్ కలెక్టరేట్: పదో తరగతి అనంతరం విద్యార్థులు పాలిటెక్నిక్ విద్యవైపు దృష్టి సారించాలని మెదక్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భవాని సూచించారు. అతి తక్కువ ఖర్చుతో బంగారు బాటలు వేసేందుకు సాంకేతిక విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచమంతా ఏఐ వైపు పరుగులు పెడుతోందని.. ఈ సమయంలో సాంకేతిక నైపుణ్యత లేకుంటే భవిష్యత్‌లో ఉపాధి దొరకడం కష్టమేనని అన్నారు. పాలిటెక్నిక్ విద్యతో లభించే ప్రయోజనాలను సోమవారం ఆమె 'సాక్షి'కి వివరించారు. డిప్లొమా ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పరిశ్రమలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. అందులో సాఫ్ట్‌వేర్, ఇంజనీరింగ్, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, రైల్వే, ఎయిర్‌లైన్స్, ట్రాన్స్‌పోర్ట్, గనులు, ఎస్‌సీసీఎల్, ఇండియన్ ఆర్మీ, నేవి, ఆర్టీసీ, ట్రాన్స్‌కో, జెన్‌కో, బీహెచ్‌ఈఎల్, బీడీఎల్, బీఈఎల్, బీఎస్ఎన్ఎల్, డిఫెన్స్, ఎన్టీపీసీ వంటి పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయి. స్వయం ఉపాధి కూడా పొందవచ్చు. ఇందుకోసం బ్యాంకులు సైతం రుణాలు త్వరితగతిన అందజేస్తాయి. పాలిటెక్నిక్ డిప్లొమాలో కంప్యూటర్, ఏఐ, మెషిన్ లర్నింగ్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, మెకానికల్ ఇంజనీరింగ్ తదితర 24 కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చు.పాలిటెక్నిక్ అనంతరం ఉన్నత విద్యావకాశాలు ఉన్నాయి. అందులో ఈసెట్ ద్వారా యూనివర్సిటీ, ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశించే అవకాశం ఉంటుంది. ఎంసెట్ ద్వారా యూనివర్సిటీ, ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో నేరుగా ప్రవేశించవచ్చునని ప్రిన్సిపాల్ వివరించారు. మెదక్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్, సీఈసీ కోర్సులలో బోధించడానికి అనుభజ్ఞులైన అధ్యాపకులు ఉన్నట్లు తెలిపారు. అన్ని వసతులతో కూడిన ల్యాబ్‌లు, టెక్నికల్ పరికరాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఇంజనీరింగ్ చేసి త్వరితగతిన ఉద్యోగం సాధించాలనుకునే బాలికలకు మంచి అవకాశం ఉన్నట్లు తెలిపారు.



మెదక్‌లోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల

హాస్టల్ వసతి

కళాశాలతోపాటు పరిసరాల్లోనే బాలికలకు ప్రత్యేకంగా అన్ని వసతులతో కూడిన హాస్టల్ వసతి ఉన్నట్లు తెలిపారు. మహిళా వార్డెన్ అందుబాటులో ఉండి నిరంతర పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం హాస్టల్‌లో 102 మంది విద్యార్థులు ఉండి విద్యనభ్యసిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ విద్యనభ్యసించిన విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి అనంతరం బాలికలు అతితక్కువ ఖర్చుతో కూడిన పాలిటెక్నిక్ సాంకేతిక విద్యను ఎంచుకొని త్వరిగతిన ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రిన్సిపల్ భవాని సూచించారు.

క్లుప్తంగా

తూప్రాన్‌లో కార్డెన్ సెర్చ్

సరైన పత్రాలు లేని
92 బైకులు, 5 ఆటోలు సీజ్



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

తూప్రాన్: అనుమానిత వ్యక్తులు కనిపించినా, అసాంఘిక కార్యక్రమాలు జరిగినా తమ దృష్టికి తేవాలని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తూప్రాన్ మున్సిపాల్టీ పరిధిలోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద డీఎస్పీ ఆధ్వర్యంలో 7 బృందాలతో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో సరైన ధ్రువపత్రాలు లేని 92 బైకులు, 5 ఆటోలు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ వాహనాలకు సంబంధించిన పత్రాలను చూపి తమ వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు. లేదంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీరి వెంట తూప్రాన్ సీఐ రంగాకృష్ణ, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు శివారులో రేషన్ బియ్యం పట్టుకున్నట్లు కొల్లూరు ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా మోకిల నుంచి రింగ్‌రోడ్డు మీదుగా కర్నూలు తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో రింగ్ రోడ్డుపై రేషన్ బియ్యం తరలిస్తున్న లారీను పట్టుకొని 34 టన్నులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మంగళవారం సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

నో హెల్మెట్.. నో ఎంట్రీ

కలెక్టరేట్‌కి వచ్చేవారికి కొత్త నిబంధనలు



వాహనదారులను ప్రధాన గేటు వద్ద నిలిపివేస్తున్న సిబ్బంది

మెదక్ కలెక్టరేట్: కలెక్టరేట్‌లోకి వాహనదారులు రావాలంటే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. హెల్మెట్ ధరించని వాహనదారులను కార్యాలయంలోకి రానివ్వొద్దంటూ గట్టి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కార్యాలయ సిబ్బంది మంగళవారం ప్రధాన గేట్ వద్ద తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ ధరించకుండా వచ్చిన వాహనదారులను కలెక్టరేట్‌లోకి అనుమతించలేదు. లేదంటే గేటు బయటే వాహనం నిలిపి లోపలికి వెళ్లాలని సూచించారు. హెల్మెట్‌తో పాటు వాహన పత్రాలు, లైసెన్స్ కలిగి ఉండాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు సిబ్బంది తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916 స్పాట్ క్యాష్ [HA-783070]

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9177555694 స్పాట్ క్యాష్ [SCA25001685]

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర:: 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6239]

CHANGE OF NAME

■ నేను, సింధోల్ రాజ్‌కుమార్ తండ్రి పద్మశాలి రాములు, వయస్సు: 32 సం॥లు, పుట్టిన తేది: 12-10-1992 అడ్రస్: పాపన్నపేట్ విలేజ్, మండలం, జిల్లా: మెదక్, నేను నా పేరును పద్మశాలి రాజ్‌కుమార్ తండ్రి పద్మశాలి రాములు అని మార్చుకుంటున్నాను. [HA-1265984]

WANTED

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ : 18K. Ph: 9160900024, 9640400073 [SCA25001686]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పెరిగిన బియ్యం కోటా

- 888 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు
- పాత కార్డుల్లో చేర్పులతో పెరిగిన లబ్ధిదారులు
- ప్రతీనెల 12 మెట్రిక్ టన్నుల బియ్యం అదనం
- నేటికీ కొనసాగుతున్న దరఖాస్తుల పరిశీలన
- లబ్ధిదారుల్లో సంతోషం



రేషన్ దుకాణంలో బియ్యం పంపిణీ

సిద్దిపేటరూరల్: కొత్త రేషన్‌కార్డుల మంజూరు జిల్లాలో పంపిణీ చేసే బియ్యం కోటా ఈనెల నుంచి పెరిగింది. పదేళ్ల కాలంలో నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియ లేకపోవడంతో ప్రస్తుత ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేసింది. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారుల కల నెరవేరింది. జిల్లాలో మొదటి విడతగా 888 కుటుంబాల వారు అర్హత సాధించినట్లు వివరాలను వెల్లడించారు. వారందరికీ ఫిబ్రవరి నుంచే రేషన్ బియ్యం అందజేస్తామని అధికారులు ప్రకటించారు. దీంతో రేషన్ పంపిణీ చేసే బియ్యం అదనంగా 12 మెట్రిక్ టన్నులకు పెరిగింది.

జిల్లాలో ఇప్పటి వరకు గ్రామసభలు, ప్రజాపాలన కేంద్రాల్లో స్వీకరిస్తున్న దరఖాస్తుల్లో నూతన రేషన్‌కార్డులు, చేర్పులు, తొలగింపు వంటి వాటికి సంబంధించి 74 వేల 272 దరఖాస్తులు వచ్చాయి. ఈ మేరకు సంబంధిత అధికార యంత్రాంగం సర్వే పూర్తి చేయడంతో పాటుగా అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు ఇచ్చింది. మరి కొంతమంది మంజూరు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో రేషన్ వివరాలు :

రేషన్ దుకాణాలు	684
రేషన్ కార్డులు	2,92,131
అంత్యోదయ కార్డులు	18341
మొత్తం లబ్ధిదారులు	8,95,467
అన్నపూర్ణ కార్డులు	82

నెలవారీగా పంపిణీ చేయాల్సిన బియ్యం **5,720** మెట్రిక్ టన్నులు

888 నూతన కార్డులు

జిల్లాలో కొత్తగా 888 కుటుంబాలకు ప్రభుత్వం రేషన్ కార్డులను మంజూరు చేసింది. ఈ మేరకు చాలా మందికి లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే కార్డు ఉండి అందులో పిల్లల పేర్లు లేకుండా చాలా మంది ఉన్నారు. ఇందులో కొత్తగా 1,900 మందిని వారి పాత కార్డుల్లో చేర్చారు. వీరందరికీ ఈనెల నుంచి బియ్యాన్ని అందించాల్సి ఉండగా అదనంగా 12 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం పడుతుంది. జిల్లా వ్యాప్తంగా పెండింగ్ ఉన్న దరఖాస్తుల్లోనూ అర్హులను గుర్తిస్తే ఈ కోటా మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది.

లబ్ధిదారుల్లో సంతోషం

ఎన్నో ఏళ్లుగా నిలిచిన రేషన్‌కార్డుల ప్రక్రియ ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ముందుకు కదలడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలన్నింటికీ రేషన్ కార్డే ప్రామాణికం కావడంతో జిల్లాలో కార్డులేని వారు దశాబ్ద కాలంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు మంజూరు కాక, ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు అందక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రుణాలు పొందలేక ఎన్నో అవస్థలు పడ్డారు. ఈ క్రమంలో జిల్లాకు కొత్తగా 888 మందికి కొత్త కార్డులు రావడంతో తమకు కూడా ప్రభుత్వ పథకాలు వస్తాయనే నమ్మకం అర్హులైన దరఖాస్తుదారుల్లో ఏర్పడింది.

కొత్త కార్డు వచ్చింది



ప్రభుత్వ చేపట్టిన ఇంటింటి సర్వే సమయంలో నూతన రేషన్‌కార్డు కోసం దరఖాస్తు అందించాను. గత నెలలో నా పేరు మీద నూతన రేషన్ కార్డు వచ్చింది. చాలా రోజులుగా రేషన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నాం. ఇప్పటికైనా రావడం చాలా సంతోషంగా ఉంది. దీంతో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను పొందెందుకు అవకాశం ఉంది.

– పుల్లగూర్ల తేజ, రాఘవాపూర్

అర్హులందరికీ అందిస్తాం



జిల్లాలో ఇటీవల 888 నూతన రేషన్ కార్డులు మంజూరు చేయడంతోపాటు 1,900 మంది పేర్లను రేషన్ కార్డుల్లో కొత్తగా చేర్చాం. వీరికి బియ్యం అందించడం జరుగుతుంది. కొత్త కార్డులు రావడం, పాత కార్డుల్లో మార్పులు, చేర్పులు జరగడంతో జిల్లాలో ఈ నెల రేషన్ బియ్యం కోటా 12 మెట్రిక్ టన్నులకు పెరిగింది. తమ వద్ద ఉన్న దరఖాస్తులను పరిశీలించడం జరుగుతుంది.

– తనూజ, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి

పోషకాల లోపం.. ఎదుగుదలపై ప్రభావం

వ్యవసాయ అధికారులు



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ నరేశ్

దుబ్బాకటౌన్: సాగు భూమిలో పోషకాల లోపంతోనే వరి నాటు వేసిన తర్వాత ఎదుగుదలపై ప్రభావం చూపిస్తుందని రాయపోల్ మండల వ్యవసాయ అధికారి నరేశ్ తెలిపారు. మంగళవారం రాయపోల్ మండల పరిధిలోని రాంసాగార్ గ్రామంలో వరి పొలాలను, రైతుల పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సాగు చేసే వరి పంటలో చౌడు భూమిలో వరి ఎర్రబారి వేసిన కర్ర వేసినట్లు ఉండి పొలం అంతా బుడబుడగా ఉండి వరి వేర్లు నల్లగా మారి భూమి లోపలి పోషకాలు తీసుకోకపోవడంతో జింక్, ఇతర పోషకాల లోపాలు కనిపిస్తున్నాయన్నారు. నివారణకు 19.19.19 ఒక కేజీ ఎకరానికి + జింక్ సల్ఫేట్ 400–500 గ్రాములు ఎకరానికి రెండు సార్లు పిచికారీ చేసి, పొలం బాగా నెర్రలు వచ్చే లాగా ఆరబెట్టాలన్నారు. ప్రస్తుతం యాసంగి కాలంలో జింక్ లోపాలు ఎక్కువ కనిపించే అవకాశం ఉందని, జింక్ నివారణ కోసం జింక్ సల్ఫేట్ 2.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రవీణ్, స్వర్ణలత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరబెడుతూ నీటి తడులు అందించాలి

వరి పంటను పరిశీలించిన వ్యవసాయాధికారులు

సాక్షి ఎఫెక్ట్..



దుబ్బాకలో పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

దుబ్బాక: ఎవరికీ రాకూడని కష్టం.. ఎర్రబడి చచ్చిపోతున్న వరి చేలు పేరిట సాక్షిలో ప్రచురితమైన కథనానికి వ్యవసాయాధికారులు స్పందించారు. మంగళవారం వ్యవసాయాధికారులు జిల్లాలోని పలు గ్రామాల్లో పర్యటించి వరి పంటలను పరిశీలించారు. దుబ్బాక మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్, ఏఈఓ మనోజ్ఞ పట్టణంలోని కేసుగారి స్వామి, గుండెల్లి శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు రైతుల పంటలను పరిశీలించారు. నాట్లేసి 45 రోజులు గడుస్తున్నా వరిపంటలు ఎదుగుదల లేకుండా కుళ్లిపోయి, ఎర్రబడి చచ్చిపోతుండడాన్ని గమనించారు. మొగి పురుగు, వాతావరణ పరిస్థితులు, భూములు తడి ఆరకుండా ఉండడంతోపాటు జింక్ తదితర సమస్యలతో పంటలకు నష్టం జరుగుతుందని గమనించారు. మొగి పురుగు ఎక్కువగా ఆశించిన పంటలకు కార్టాప్ 4 జీ గుళికలు లేదా క్లోరంత్రానిలిప్రోలే లేదా బరోజ్ వంటి మందులు వేసుకోవాలన్నారు. వరి పంటలను ఆరబెడుతూ నీటి తడులు అందించాలి. పలు సస్యరక్షణ చర్యలను రైతులకు సూచించారు.

మనస్తాపంతో ఉరేసుకొని ఆత్మహత్య

తంప్లూర్‌లో వ్యక్తి

టేక్మాల్(మెదక్): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన టేక్మాల్ మండలంలోని తంప్లూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ దయానంద్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన చాకలి అశోక్ (38), వెంకట్రావు పేటకు చెందిన వెంకటలక్ష్మీకి 20 ఏళ్ల కింద వివాహం జరిగింది. వీరిద్దరూ హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. వీరిద్దరి మధ్య కుటుంబ విషయంలో కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. 16న దంపతులిద్దరూ తంప్లూర్ గ్రామానికి వచ్చారు. అదే రోజు మధ్యాహ్నం ఇంటి వద్ద గొడవ జరగడంతో వెంకటలక్ష్మీ హైదరాబాద్ వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన అశోక్ సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి చాకలి పోచయ్య మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నార్సింగ్‌లో యువకుడు

పాపన్నపేట(మెదక్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని నార్సింగిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. మధ్యప్రదేశ్ కు చెందిన సంజీవ్ కుమార్ (25) ఉపాధి నిమిత్తం రాష్ట్రానికి వచ్చి కామారెడ్డికి చెందిన శ్రీలత అనే అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. కొంత కాలంగా పాపన్నపేట మండలం నార్సింగి గ్రామంలో వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగొద్దని చెప్పినా వినకపోవడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న భార్య శ్రీలత ఘటనా స్థలికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వివాహేతర సంబంధంతో హత్యాయత్నం

- మహిళ భర్తపై దాడికి పాల్పడ్డ యువకుడు
- అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు

సిద్దిపేటకమాన్: మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న యువకుడు ఆమె భర్తపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. ఐల శ్రీధర్, భార్య ఇద్దరు పిల్లలతో కలిసి గుండ్ల చెరువులో నివాసం ఉంటున్నాడు. శ్రీధర్ పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన మెరుగు శ్రావణ్ (21) సదరు మహిళతో కొద్ది రోజులుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. దీనికి గాను అడ్డు తొలగించుకోవాలని శ్రవణ్‌తో కలిసి భర్త శ్రీధర్‌ను చంపడానికి పథకం వేసింది భార్య. గత నెల 11న రాత్రి పని ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న శ్రీధర్‌ను శ్రావణ్ లిఫ్ట్ అడిగాడు. ఇద్దరూ బైక్‌పై వెళ్తున్న క్రమంలో నర్సాపూర్ చౌరస్తా సమీపంలో యువకుడి ఇద్దరు స్నేహితులు వీరి వెనుకాలే వచ్చారు. ముగ్గురూ కలిసి శ్రీధర్‌ను కిడ్నాప్ చేసి కాళ్లు, చేతులు కట్టేసి దాడి చేశారు. మళ్లీ రెండోసారి గత నెల 20న శ్రీధర్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు శ్రీధర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా 12న కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక విచారణ అనంతరం ప్రధాన నిందితుడు మెరుగు శ్రావణ్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



లక్ష్మయ్య (ఫైల్)

టేక్మాల్(మెదక్): చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బొడ్మట్‌పల్లిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ దయానంద్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన చీలపల్లి లక్ష్మయ్య(59) రజక వృత్తితోపాటు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తరచుగా చేపలు పట్టేందుకు వాగుల్లోకి, కుంటల్లోకి వెళ్లేవాడు. 14న ఉదయం ఇంటి నుంచి వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. ఆచూకీ కోసం బంధువులు, వ్యవసాయ పొలాల వద్ద వెతుకుతుండగా 17న రాత్రి గుండువాగు గడ్డపై లక్ష్మయ్య బట్టలు, సెల్‌ఫోన్, చెప్పులు కనిపించాయి. వాగులోకి పరిశీలించి చూడగా లక్ష్మయ్య మృతదేహం కనిపించింది. చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య చీలపల్లి పోచమ్మ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడు

పుల్‌కల్(అందోల్): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని పుల్‌కల్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీస్‌ల కథనం మేరకు.. పుల్‌కల్ గ్రామానికి చెందిన బోయిని నవీన్ (25) సోమవారం రాత్రి కడుపునొప్పి భరించలేక ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సంగారెడ్డి ఆస్పత్రికి తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పుల్‌కల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పన్ను వసూళ్లలో వేగం పెంచాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: గ్రామాల్లో ఇంటి పన్ను వసూళ్లలో వేగం పెంచి వందశాతం పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి పంచాయతీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి మండల ప్రత్యేక అధికారులు, మండల పరిషత్ అధికారులు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ పన్ను చెల్లింపు అవసరాన్ని తెలియజేయాలన్నారు. గ్రామాల్లో ఇంటి యజమానులు, ఇంటి పన్ను చెల్లించేందుకు ముందుకు రావాలని కోరారు. రేషన్ కార్డుల వెరిఫికేషన్ పూర్తిగా పారదర్శకంగా జరగాలని అర్హులైన వారికి మాత్రమే రేషన్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పూర్తి సమాచారం అధికార యంత్రాగణానికి అందుబాటులో ఉండాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు, పాఠశాలలను, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలను క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డీపీఓ సాయిబాబా, ట్రైనీ కలెక్టర్ మనోజ్, సంబంధిత జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



శివ్వంపేటలో ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

నర్సాపూర్: పోలింగ్ కేంద్రం వద్ద నిబంధనల మేరకు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఎస్‌ఐ లింగంకు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎస్పీ మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వం జూనియర్ కాలేజీలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను, ఓటరు జాబితాను పరిశీలించారు. ఎస్‌ఐ, మండల ఆర్‌ఐ ఫైజల్ పోలింగ్ స్టేషన్ల వివరాలను ఎస్పీకి వివరించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లో పలు రికార్డులు పరిశీలించి కేసులను త్వరగా ఛేదించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలని ఎస్‌ఐకి సూచించారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేట ఉన్నత పాఠశాలలోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట సీఐ రంగకృష్ణ, ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి ఉన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన బొలేరో వాహనం

కామారెడ్డి జిల్లాలో సిర్గాపూర్ మండలానికి చెందిన మహిళ మృతి



శకుంతల మృతదేహం

కల్హేర్(నారాయణఖేడ్): కామారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సిర్గాపూర్ మండలం అంతర్‌గామ్‌కు చెందిన మహిళ మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. అంతర్‌గామ్‌కు చెందిన సంగయ్య, శకుంతల(55) దంపతులు బైక్‌పై మంగళవారం కామారెడ్డి జిల్లా పిట్లం మండలం పెద్దకోడప్‌గల్ గ్రామంలోని బంధువుల ఇంటికి బయల్దేరారు. చిన్నకోడప్‌గల్ వద్ద సంగారెడ్డి–నాందేడ్ 161 నేషనల్ హైవేపై వెనుక నుంచి బొలేరో వాహనం వీరి బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా అంబులెన్స్‌లో స్థానికులు పిట్లం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో శకుంతల మృతి చెందింది. సంగయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పిట్లం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త రకం శనగతో అధిక దిగుబడులు

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త పల్లవి



శనగ పంటపై పరిశోధన చేస్తున్న శాస్త్రవేత్తలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు ఎన్‌బీ ఈజీ 47 కొత్త రకం శనగను సాగు చేసుకోవాలని, దీంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త పల్లవి, కో ఆర్డినేటర్ విజయ్ తెలిపారు. మండల కేంద్రమైన జగదేవ్‌పూర్, అలిరాజ్‌పేట గ్రామంలో రైతుల పొలాల్లో వ్యవసాయ శాఖ సహకారంతో క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ రకం శనగను సాగు చేస్తే నిటారుగా పెరగడమే కాకుండా కాయ పైకి వస్తుందని, మెషిన్ హార్ వెస్టింగ్ చేసుకోవడానికి అనువుగా ఉంటుందన్నారు. ఎండు తెగుల్ని సమర్థవంతంగా తట్టుకొని 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. అనంతరం ఎనుగుల శ్రీనివాస్‌రెడ్డి రైతు పొలంలో వేసిన ధనియాల సాగును పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు, ఏఈఓ కవిత, రైతులు పాల్గొన్నారు.

పందిరి సాగు.. ఫలితాలు బాగు

- ఉద్యాన పంటలతో సిరులు
- ఆసక్తి చూపుతున్న రైతులు



పందిరి సాగు విధానంతో బీరకాయ సాగు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆరుగాలం కష్టపడి ప్రకృతి వైపరీత్యాలు తట్టుకొని వరి సాగు చేస్తే సరైన దిగుబడి రాక, గిట్టుబాటు ధర అందడం లేదని ఆందోళన చెందుతున్న రైతులు తమ ఆలోచను మార్చుకుంటున్నారు. సంప్రదాయ పంటలకు బదులుగా ఉద్యాన పంటల వైపు మళ్లుతున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ తమకున్న కొద్ది పాటి సాగు భూమిలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రత్యామ్నాయ ఉత్పత్తులు, ఉద్యాన పంటల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటే సాగును లాభాల బాటలో నడిపించొచ్చని నిరూపిస్తున్నారు. చిన్నకోడూరు మండలంలో సుమారు 90 ఎకరాల్లో పందిరి సాగు ద్వారా కూరగాయలు పండిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

పందిరి సాగుతో మేలు

రైతులు వారి భూముల్లో పందిరి వేసి, ఉద్యాన పంటను సాగు చేస్తే మంచి లాభాలను పొందవచ్చు. ఎకరా భూమిలో పందిరి సాగు అమలు చేసే రైతులు ఉద్యానశాఖ ద్వారా రూ. లక్ష సాయం అందిస్తుండగా, ఇందులో రూ. 50 వేలు సబ్సిడీ వస్తుంది. మిగితా సగాన్ని రైతులు భరించాల్సి వస్తుంది. అధికారులే పందిరి సిద్ధం చేసి ఇస్తారు. సుమారు నాలుగేళ్ల వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీగజాతి కూరగాయలు పండించుకోవచ్చు. కాకర, బీర, దొండ, సొరకాయ పండిస్తూ ఆదాయం పొందవచ్చు. పందిరి కింది భాగంలో ఖాళీగా ఉన్న స్థలంలో టమాట, వంకాయ, బెండ వంటి అంతర పంటలు సాగు చేయవచ్చు.

దిగుబడి బాగుంది

పందిరి సాగు విధానంతో దిగుబడులు బాగున్నాయి. ఈ విధానం ద్వారా కలుపు తక్కువగా ఉండి కూలీల అవసరం ఉండదు. కూరగాయలు కుళ్లిపోకుండా ఉంటాయి. చీడ పీడలు ఎక్కువగా ఆశించవు. పంటలు సాఫీగా వస్తాయి. మార్కెట్‌లో మంచి ధర పలుకుతుంది.

–నాగర్తి తిరుపతిరెడ్డి, రైతు మాచాపూర్